క్లుప్తంగా

గడ్డివాముల దగ్ధం



వెంగాపురం కళ్లాల్లో దగ్ధమైన గడ్డి వాములు

బలిజిపేట: వెంగాపురంలో రైతులు కళ్లాల్లో పెట్టుకున్న గడ్డి కుప్పలు ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో శనివారం కాలిపోయాయి. అలమండ శివుడునాయుడు, ఎల్లంనాయుడులకు చెందిన 15 ఎకరాల గడ్డి వాములు దగ్ధమయ్యాయి. వీటి ఖరీదు సుమారు రూ.30వేల వరకు ఉండవచ్చని అంచనా.

విద్యా హక్కు చట్టం నిబంధనలు పాటించాలి

బలిజిపేట: విద్యా హక్కు చట్టం నిబంధనలు ప్రైవేటు పాఠశాలలు పాటించాలని ఎంఈఓ – 1 సామల సింహాచలం అన్నారు. ఎంఈఓ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం 12(1) ప్రకారం పాఠశాలల పూర్తి వివరాలను ఫారం 1లో పూర్తి చేసి వారి లాగిన్ ద్వారా తప్పనిసరిగా సబ్మిట్ చేయాలన్నారు. 12(1)సి ప్రకారం పేద, బలహీన వర్గాల పిల్లలకు అన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో 1వ తరగతి ప్రవేశాలలో 25శాతం సీట్లు ఉచితంగా కల్పించాలని ప్రతినిధులకు సూచించారు. వీటికి సంబంధించిన ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. నిబంధనలకు లోబడి అన్నింటిని సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఎండీఎస్ విత్తనాల పంపిణీ



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయంలో ప్రీ మాన్సూన్ డ్రై షోయింగ్‌పై రైతులకు ఎంసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావు అవగాహన కల్పించారు. అంపావల్లి రైతు సేవా కేంద్రంలో రైతులతో శనివారం సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించి కిట్లు పంపిణీ చేశారు. ప్రధాన పంటకు ముందు సుమారు 30రకాలు ఎకరాకు 12కిలోలు వంతున విత్తనాలు చల్లుకుని 40 రోజుల తరువాత వాటిని భూమిలో కలియ దున్నడం చేయాలన్నారు. దీని వలన రైతుకు, భూమికి, పర్యావరణానికి, ప్రధాన పంట వినియోగదారునికి ప్రయోజం సమకూరుతుందన్నారు. నీటి ఎద్దడి నుంచి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల ప్రచారం



అంపావల్లిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాల సిబ్బంది

బలిజిపేట: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి ఫలితాలు రావడంతో సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు ఫ్లెక్సీల రూపంలో ప్రచారం చేస్తున్నారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చాలని కోరుతున్నారు. ఇటీవల టెన్త్ ఫలితాల్లో ఎక్కువ మార్కులు వచ్చిన వారితో ఫ్లెక్సీలు వేయించి ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రుల ఆలోచనల్లో కొంత మార్పు వచ్చే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఎంఆర్‌సీకి చేరుకున్న పాఠ్య పుస్తకాలు



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

మక్కువ: 2025 – 26 విద్యా సంవత్సరానికి సంబంధించి, విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయానికి శనివారం చేరుకున్నాయి. ఎంఈఓలు సత్యనారాయణ, శ్యాంసుందర్ పాఠ్య పుస్తకాలను పరిశీలించారు. తరగతుల ప్రకారం పుస్తకాలను, నోట్ బుక్‌లను స్థానిక ఎస్ఎన్ పాఠశాలలో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఎంఈవోలు సత్యనారాయణ, శ్యాంసుందర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు తొలి విడతగా 23,972 నోట్ బుక్‌లు, 16,759 టెస్ట్ బుక్కులు వచ్చినట్టు తెలిపారు.

శ్రమించినా.. సాగని జీవనం

- మట్టి వస్తువులకు తగ్గిన డిమాండ్
- కష్టపడినా దక్కని ఫలితం
- ఆర్థిక ఇబ్బందుల్లో కుమ్మరులు
- ప్రభుత్వ సాయంకోసం ఎదురుచూపులు





విక్రయానికి ఉంచిన మట్టితో తయారు చేసిన రకరకాల వస్తువులు, (ఇన్‌సెట్లో) మట్టి పొయ్యిలు

బలిజిపేట: మట్టిలో మట్టిగా కలిసి పని చేసినా జీవనం సజావుగా సాగటం లేదని, కడుపు నిండటం లేదని కుమ్మరి కుటుంబాలకు చెందిన వారు ఆవేదన చెందుతున్నారు. ఎండ, వాన లేకుండా కష్టపడుతున్నా ప్రయోజనం ఉండడం లేదని వాపోతున్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో మట్టి కుండలకు, ప్రమిదలు, మట్టితో తయారుచేసే వస్తువులకు డిమాండ్ తగ్గడమే ఈ పరిస్థితికి కారణమని కుమిలిపోతున్నారు. ప్రస్తుత సమాజంలో ప్లాస్టిక్, సిల్వర్ వస్తువుల వాడకాలు రావడంతో మట్టి వస్తువులు నిరాదరణకు గురయ్యాయి. చేసేది లేక కులవృత్తిని కాదనలేక చిన్నచిన్న వస్తువులు చేసుకుని వాటిని విక్రయించుకుంటున్నామని వారు వాపోతున్నారు. కార్తీకమాసం, సంక్రాంతి, వేసవి కాలంలో మట్టి వస్తువులకు మంచి డిమాండ్ ఉంటుంది. మండలంలో నారాయణపురం, బలిజిపేట తదితర గ్రామాల్లో కుమ్మరి కుటుంబీకులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వీరంతా మట్టి వస్తువులను తయారు చేయడంలో పేరు పొందినవారే. కుండలు, పొయ్యిలు, ప్రమిదలతో పాటు అవసరమైన వస్తువులను తయారుచేస్తారు. కొన్ని కార్యక్రమాలకు మట్టి వస్తువులు అవసరం కావడంతో వాటిని మాత్రమే తయారు చేయడం జరుగుతుందని వారు చెబుతున్నారు. వారపు సంతల్లో కుమ్మర్లు తీసుకువచ్చే మట్టి వస్తువులను సంతకు వచ్చేవారు కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం వారపు సంతల్లో మట్టి వస్తువులకు గిరాకీ తగ్గింది. గత కొంతకాలంగా వ్యాపారం సాగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వపరంగా ఆర్థిక సాయాన్ని అందించాలని కుమ్మర్లు కోరుతున్నారు.

మట్టి కుండల్లో నీరు ఆరోగ్యమైనప్పటికి సాధారణంగా జీవించే వారి ఇళ్లలో కూడా ఫ్రిజ్‌లు ఉండడంతో వీటిని కొనేవారు తక్కువ అవుతున్నారు. దీపపు ప్రమిదలలో దీపాలు పెట్టేవారు కరువయ్యారు. వీటికి ఎలక్ట్రికల్ బల్బులు రావడంతో మట్టి ప్రమిదలకు డిమాండ్ తగ్గింది. పూర్వ కాలంలో రైతుల ఇళ్లలో మట్టి పొయ్యలపై వంటలు వండేవారు. ఇప్పుడు వాటికి బదులు గ్యాస్‌స్టవ్‌ల వినియోగం ఎక్కువయిందన్నారు. ఇలా చూసుకుంటే చాలా వరకు మట్టి వస్తువుల వినియోగం తగ్గిపోయింది. ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందిస్తే వృత్తిదారులకు మేలు జరుగుతుందని లేకుంటే ముంముందు మరిన్ని కష్టాలు తప్పేలా లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీవనం కష్టంగా ఉంది



వృత్తి పని చేసుకోవడానికి కష్టంగా ఉంటుంది. చేతిలో వృత్తి పని ఉన్నప్పటికి వస్తువులకు డిమాండ్ లేకపోవడంతో తయారీ కష్టమవుతుంది. ఊహించిన స్థాయిలో విక్రయాలు లేకుండా పోయాయి. దీంతో జీవనోపాదులు కష్టమయ్యాయి.

– నాగరాజు, కుమ్మరి వృత్తిదారు, బలిజిపేట

నాణ్యమైన విద్యను అందించాలి



ట్రైనర్లకు ట్యాబ్‌లను అందజేస్తున్న ఏపీసీ తేజేశ్వరరావు

పార్వతీపురం: ఒకేషనల్ విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా నాణ్యమైన విద్యను అందించాలని ఒకేషనల్ ట్రైనర్లకు, కో–ఆర్డినేటర్లకు జిల్లా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఆర్.తేజేశ్వరరావు సూచించారు. సమగ్ర శిక్ష కార్యాలయంలో ఒకేషనల్ ఎడ్యుకేషన్ ట్రైనర్లు, కో ఆర్డినేటర్లకు సమగ్ర శిక్ష పథకం ద్వారా మంజూరైన ట్యాబ్‌లను, ఎడాప్టర్‌లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లోని 11 ట్రేడులలో వున్న 71మంది ట్రైనర్లకు, ఇద్దరు ఒకేషనల్ కో ఆర్డినేటర్లకు రూ.14.60లక్షల విలువైన శ్యామ్‌సంగ్ గేలాక్సీ ట్యాబ్‌లను, ఎడాప్టర్‌లను సమగ్ర శిక్ష పథకం ద్వారా మంజూరు చేసినట్టు తెలిపారు. విద్యార్థులకు ఈ ట్యాబ్‌ల ద్వారా సాంకేతికతను జోడించి బోధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జీసీడీవో ఎస్.మధుకిషోర్, ఒకేషనల్ ట్రైనర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: మండలంలోని పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేసేందుకు స్థలాలు, గృహాలు లేని అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్ శనివారం తెలిపారు. స్థలాలు లేని వారు, ఇళ్లు లేని వారు ఈ సేవ, సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానించేందుకు మార్గదర్శకాలు విడుదల చేసిందని, దీన్ని పేదలు వినియోగించుకోవాలని సూచించారు.

ఎస్సీ యువతకు స్వయం ఉపాధి పథకాలు

మక్కువ: షెడ్యూల్డ్ కులాల కార్యాచరణ ప్రణాళిక 2025 – 26 కింద ఎస్సీ యువత స్వయం ఉపాధి పథకాలకు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో స్వరూపారాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకాలను పొందుటకు ఆసక్తి గల ఔత్సాహిక షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో మే10వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కమ్యూనిస్టు వైతాళికుడు శ్రీరామ్మూర్తి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుబ్బరావమ్మ

పార్వతీపురం: ప్రజా ఉద్యమాల పట్ల నిరంతరం శ్రమిస్తూనే కార్మిక రైతాంగ వర్గానికి వెన్నుదన్నుగా నిలుస్తూ విశాల ఐక్య ఉద్యమాలకు ఊపిరి పోసిన కమ్యూనిస్టు వైతాళికుడు రెడ్డి శ్రీరామ్మూర్తి అని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.సుబ్బరావమ్మ అన్నారు. పట్టణంలోని ఎన్‌జీవో హోం భవనంలో శనివారం నిర్వహించిన రెడ్డి శ్రీరామ్మూర్తి నాలుగవ వర్ధంతి సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలపై నికరంగా పోరాడేందుకు డీవైఎఫ్‌ఐ సంఘ నాయకుడిగా సమాజానికి పరిచయం అయ్యాడన్నారు. మతోన్మాద శక్తుల నుంచి విముక్తి పొందేందుకు కార్మికవర్గం ద్వారా సోషలిజమే ప్రత్యామ్నాయమని నమ్మిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘ అధ్యక్షుడు జీవి.కిషోర్, సీపీఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి శ్రీదేవి, ఎం.తిరుపతిరావు, జీవి.రమణ, కె.సాంబమూర్తి, బీవి.రమణ, బి.దాసు, వై.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

20న సమ్మెలో మేము సైతం..



మున్సిపల్ అధికారులకు సమ్మె నోటీసును అందిస్తున్న యూనియన్ నాయకులు

సాలూరు: కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని తదితర డిమాండ్లతో ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో తాము కూడా పాల్గొంటున్నామని మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు సమ్మె నోటీసును మున్సిపల్ అధికారులకు శనివారం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, రాష్ట్రంలో ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలనే ప్రభుత్వ ఆలోచన మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రాముడు, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన యువత ప్రాణాలకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం: ఉపాధి కోసం వలస వెళ్లిన గిరిజన యువత ప్రాణాలకు రక్షణ కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.దాలినాయుడు, ఎస్.సాయి శ్రీనివాస్, కె.కిరణ్‌కుమార్, టి.గౌరీశంకరరావు కోరారు. శనివారం వారు మాట్లాడుతూ ఉపాధి కోసం వలస వెళ్లి రొయ్యల చెరువులో విద్యుత్ షాక్‌కు గురై బిడ్డిక ప్రశాంత్, కిరణ్‌లు మృతి చెందడం బాధాకరమన్నారు. జిల్లాలోని కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస, పాచిపెంట, మక్కువ తదితర మండలాలకు చెందిన గిరిజన యువతకు ఈ ప్రాంతంలో ఉపాధి లేక హైదరాబాద్, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం తదితర పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. యువతకు ఉపాధి కల్పించే నెపంతో అతి తక్కువ వేతనాలకు యజమానులు వెట్టి చాకిరి చేయిస్తున్నారన్నారు. ప్రమాదకర స్థలాలలో పని చేస్తూ యువత ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారన్నారు. పని ప్రదేశంలో ఆడ పిల్లలకు వేధింపులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఐటీడీఏ పరిధిలో గిరిజనులకు ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పని ప్రదేశాలలో లేబర్ చట్టాలు అమలయ్యేలా చూడాలని వారు కోరారు.

నవధాన్యాల సాగుతో మేలు

సీతానగరం: పీఎండీఎస్ నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఏవో ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని పణుకుపేట, గుచ్చిమి ఆర్ఎస్‌కేల్లో నవధాన్యాలతో రైతులకు కలిగే ప్రయోజనాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమి కోతకు గురి కాకుండా ఉంటుందన్నారు. జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. పంట దిగుబడులు పెరుగుతాయని, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



వెంకటాపురం – నీలకంఠాపురం గ్రామాల మధ్య పడిన విద్యుత్ స్తంభం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. నువ్వు చేలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి. అకాల వర్షాలతో కూలిన విద్యుత్ స్తంభాల వల్ల సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బూర్జ – నీలకంఠాపురం గ్రామాల మధ్య పొలాల్లో ఇటీవల వేసిన విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



పార్వతీపురం టౌన్: విద్యుత్ తీగలపై పడిన చెట్టు

త్రుటిలో తప్పిన ప్రమాదం

పార్వతీపురం టౌన్: పట్టణంలో శనివారం కురిసిన భారీ వర్షానికి విద్యుత్ తీగలపై వృక్షం పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే... శనివారం పట్టణంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో బెలగాం జిల్లా ట్రెజరీ కార్యాలయ సమీపంలో ఓ చెట్టు విద్యుత్ తీగలపై పడిపోయింది. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు.

పండగ సమీపిస్తున్నా.. పారిశుధ్య లోపమేనా..!



వార్డుల్లో దర్శనమిస్తున్న చెత్త కుప్పలు

సాలూరు: పట్టణంలోని శ్యామలాంబ అమ్మవారి పండగ సమీపిస్తున్నప్పటికి పారిశుధ్య పనులు నత్త నడకన సాగుతున్నాయి. వార్డుల్లో చెత్తా చెదారాలు పేరుకుపోవడం, కాలువల్లో మురుగు కారణంగా దోమలు అధికమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ప్రజాప్రతినిధులు వద్ద వాపోతున్నారు. కాగా గత రెండు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలు వలన కాలువల్లో మురుగు కొట్టుకుపోవడంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. మరో వైపు వార్డుల్లో పేరుకుంటున్న చెత్తను తొలగించడంలో సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సి ఉందని ప్రజలు సూచిస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఉదారత



గోతుల్లో వేయిస్తున్న క్వారీ బుగ్గి

సీతానగరం: మండలంలోని వెంకటాపురం ఎస్సీ కాలనీలో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేక కాలనీ వాసులు కొన్నాళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలు కారణంగా ఎస్సీ కాలనీలో నీరు మళ్లించడానికి అవకాశం లేకపోవడంతో గోతులు ఏర్పడి తద్వారా దోమలకు నిలయంగా మారింది. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బి.గౌరునాయుడు, ముకుందరావు, చిన్నారావు, గోపాలనాయుడు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన గోతులు పూడ్చడానికి సొంత నిధులతో క్వారీ బుగ్గిని వేయించారు. దీంతో కాలనీ వాసులు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

జేసీ వ్యాఖ్యలపై పంచాయతీ కార్యదర్శుల అభ్యంతరం



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పార్వతీపురం రూరల్: జిల్లా జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో ఈ నెల 2న జిల్లా స్థాయి, మండల స్థాయి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో పంచాయతీ కార్యదర్శులపై జిల్లా జాయింట్ కలెక్టర్ చేసిన వ్యాఖ్యలపై పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎంపీడీఓ రమేష్‌బాబు ద్వారా జిల్లా గ్రామ పంచాయతీ అధికారికి పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సచివాలయాల పర్యవేక్షణపై ఉన్న అధికారాలపై స్పష్టత కోరుతూ జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అధికారుల నుంచి గ్రామ సచివాలయాల పర్యవేక్షణపై ఉన్న అధికారాలపై స్పష్టత వచ్చే వరకు తమకు కేటాయించిన క్లస్టర్ పరిధిలో సంబంధించిన విధులు మాత్రమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

● ఎర్ర తురాయి.. అదిరింది..!



పార్వతీపురం ముండలంలోని ఎమ్మార్‌నగరం నుంచి పెదబొండపల్లి గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఎర్ర తురాయి విరబూయడంతో పచ్చని చెట్ల మధ్య ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తోంది. అటువైపుగా వెళ్తున్న వాహన చోదకులకు, పాదచారులకు కనువిందు చేస్తోంది. అదే సమయంలో చల్లదనాన్ని కూడా అందిస్తోంది.

– పార్వతీపురం రూరల్

● ఆదమరిస్తే.. అంతే...



పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి గ్రామ సమీపంలో పెట్లగెడ్డ చెరువు రహదారి మలుపు వద్ద రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో వాహనచోదకులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు. కోతకు గురైన ప్రాంతాన్ని వాహన చోదకులు గుర్తించకపోతే ప్రమాదం చోటుచేసుకొనే అవకాశం వుంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రహదారి పరిధిలో అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులను నిర్వహించి ప్రమాదాలను నివారించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

– పార్వతీపురం రూరల్

● జిల్లా కార్యాలయాలకు దారేది..



పార్వతీపురం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గం చిన్నపాటి వర్షాలకే చెరువులా మారిపోతుంది. దీంతో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో శనివారం కురిసిన చిన్నపాటి వర్షానికే ఆ దారి చెరువును తలపించింది. అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– పార్వతీపురం టౌన్